
ఆర్మూర్ పవర్ యూత్ దుర్గామాత మండపంలో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు


నందిపేట్ పాతూర్‌లో కరెన్సీ నోట్లతో ఓంకారేశ్వర దుర్గామాత వద్ద అలంకరణ


నగరంలోని వివేకానందనగర్ కాలనీలో శ్రీమాత దుర్గాదేవి సమితి ఆధ్వర్యంలో కుంకుమపూజ చేస్తున్న మహిళలు

# మండపాల వద్ద ప్రత్యేక పూజలు


నవీపేటలో జై దుర్గామాత మండపం వద్ద అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

- **సరస్వతీ మాత రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు**

నమస్తే తెలంగాణ యంత్రాంగం, అక్టోబర్ 20 : దేవీ శరన్నరవరాత్రోత్సవాల్లో భాగంగా మండపాల వద్ద ప్రత్యేకపూజలు కొనసాగుతున్నాయి. శుక్రవారం అమ్మవారిని సరస్వతీమాత రూపంలో అలంకరించారు. మండపాలవద్ద హోమాలు, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు, అన్నదానాలు కొనసాగుతున్నాయి. రుద్రూర్‌లోని ఎల్లమ్మఆలయం వద్ద చండీ యాగం నిర్వహించారు. ధర్పల్లిలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద అన్నదానం చేశారు. ఎంపీపీ నల్ల సారికా హన్మంత్‌రెడ్డి పూజలు చేశారు. వివేకానందనగర్ కాలనీలో శ్రీమాత దుర్గాదేవి సమితి ఆధ్వర్యంలో కుంకుమపూజను వైభవంగా నిర్వహించారు. జక్రాన్‌పల్లిలోని మండపం వద్ద సర్పంచ్ జక్కం చంద్రకళాబాలకిషన్ పూజలు చేశారు. నిజామాబాద్ రూరల్ మండలం మల్లారం శివారులో ఉన్న లింగేశ్వరగుట్ట ఆశ్రమంలో పిట్ల కృష్ణ మహరాజ్ ఆధ్వర్యంలో హోమం, ప్రత్యేక పూజలు చేశారు. ఇందల్వాయిలోని మండపం వద్ద కందాలై రాజగోపాలాచారి ఆధ్వర్యంలో పత్యేక పూజలు కొనసాగాయి. రుద్రూర్ మండలకేంద్రంలో దుర్గమాతకు పల్లకీ సేవ నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో శోభాయాత్రకు స్వాగతం పలికారు. నందిపేట్ మండలం పాతూర్



లోని ఓంకారేశ్వర దుర్గామాత లక్ష్మీదేవి రూపంలో దర్శనమిచ్చారు. మండపాన్ని నిర్వాహకులు రూ.19 లక్షల 99 వేల 99 విలువైన కరెన్సీనోట్లతో అలంకరించారు. ఆర్మూర్‌లోని మహాలక్ష్మి కాలనీలో పవర్ యూత్ మండపం వద్ద యజ్ఞం, కుంకుమార్చన నిర్వహించారు. నవీపేటలో మండలకేంద్రంలో జైభవానీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 500 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. మాక్లూర్ మండలం మానిక్‌భండార్‌లోని ఆర్టీసీకాలనీ మండపం వద్ద కాత్యాయనీ రూపంలో అమ్మవారిని అలంకరించి, కుంకుమపూజలు చేశారు.


మల్లారం లింగేశ్వర గుట్ట ఆశ్రమంలో యజ్ఞం నిర్వహిస్తున్న పిట్ల కృష్ణ మహరాజ్


రుద్రూర్‌లో దుర్గామాత పల్లకీ సేవలో పాల్గొన్న గ్రామస్తులు

# ధాన్యం సేకరణ ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

- **కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు**
- **బర్ధిపూర్, ఇందల్వాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం**


ఇందల్వాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

డిచ్‌పల్లి/ నిజామాబాద్ స్పోర్ట్స్, అక్టోబర్ 20 : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియను ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సజావుగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్, ఇందల్‌వాయి మండల కేంద్రంలో ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ యాదిరెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని పరిశీలించి యంత్రం ద్వారా తేమ శాతాన్ని కొలిచారు. కొనుగోలు కేంద్రం వద్ద సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. ప్రభుత్వం క్వింటాలు ఏ-గ్రేడ్ ధాన్యానికి రూ.2,203, బీ- గ్రేడ్ రకానికి రూ.2,183 చొప్పున మద్దతు ధర చెల్లిస్తున్నట్లు తెలిపారు. రైతులు నాణ్యతాప్రమాణాలకు లోబడి, ఆరబెట్టిన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతంగా, నిర్దేశ లక్ష్యానికి అనుగుణంగా పక్కాగా చేపట్టాలన్నారు. కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు లారీల్లో లోడ్ చేయించి, రైస్‌మిల్లులకు తరలించాలని, సరిపడా వాహనాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ధాన్యం సేకరణలో అలసత్వానికి తావివ్వకూడదని అన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు బిల్లుల చెల్లింపులు త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, షామియానాలు అందుబాటులో ఉంచాలన్నారు. కలెక్టర్ వెంట డీఎస్‌వో చంద్రపకాశ్, సివిల్ సప్లయిూస్ డీఎం జగదీశ్, డీసీవో సింహాచలం, జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌హుస్సేన్, విండో చైర్మన్లు గోవర్ధన్‌రెడ్డి, రామకృష్ణ, సొసైటీ సీఈవోలు, స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్ పరిశీలన

నిజామాబాద్ స్పోర్ట్స్, అక్టోబర్ 20 : జిల్లాకేంద్రంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు శుక్రవారం పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్‌ను తెరిపించి, బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు, ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన గదులను పరిశీలించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించాల్సిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. యంత్రాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పవన్, సాత్విక్, సంతోష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

# లారీ చోరీ కేసులో నిందితుల అరెస్టు

- **లారీ, కత్తి, సెల్‌ఫోన్లు స్వాధీనం**
- **ముగ్గురు రిమాండ్‌కు తరలింపు**


వివరాలను వెల్లడిస్తున్న సీఐ నరహరి

నిజామాబాద్ క్రైం, అక్టోబర్ 20 : జిల్లాకేంద్రంలోని త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ ప్రాంతం నుంచి నెల రోజుల క్రితం లారీని దొంగిలించిన ముగ్గురు నిందితులను పోలీసులు పట్టుకున్నారు. నగర సీఐ నరహరి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ప్రవీణ్ కుమార్‌తో కలిసి శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నగరంలోని నిజాంకాలనీకి చెందిన సయ్యద్ హైమద్ గత నెల 14వ తేదీన తన లారీని నగరంలోని శ్రద్ధానంద్ గంజ్ వద్ద నిలిపిఉంచాడు. 17వ తేదీన వెళ్లి చూడగా.. అక్కడ లారీ కనిపించకపోవడంతో త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

సయ్యద్ హైమద్ ఓ డ్రైవర్‌పై అనుమానం వ్యక్తం చేయగా అతడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా.. నేరాన్ని అంగీకరించాడు. డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లికి చెందిన సయ్యద్ సోహైల్, నగరంలోని ఆటోనగర్‌కు చెందిన షేక్ అంజద్, హబీబ్‌నగర్‌కు చెందిన షేక్ షోయబ్ కలిసి శ్రద్ధానంద్ గంజ్ వద్ద నిలిపి ఉంచిన లారీని చోరీ చేసినట్లు విచారణలో తేలిందని సీఐ వెల్లడించారు. అయితే చోరీ చేసిన లారీ భాగాలను విడదీసి మహారాష్ట్రలో విక్రయించేందుకు ముగ్గురు ప్లాన్ వేసుకున్నట్లు పేర్కొన్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి, వారి నుంచి చోరీ చేసిన లారీతో పాటు ఒక కత్తి, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. కేసును ఛేదించిన ఎస్సై ప్రవీణ్‌కుమార్, ఏఎస్సై వాహబ్, సిబ్బంది అఫ్సర్, ఎస్కే షౌకత్ అలీ, బాబు, చమింద్‌ను ఏసీపీ కిరణ్‌కుమార్ అభినందించారు.

## డీజేలకు నో పర్మిషన్


డీజే నిర్వాహకులతో మాట్లాడుతున్న పోలీసులు

నిజామాబాద్ క్రైం, అక్టోబర్ 20 : ఎన్నికల కోడ్ నేపథ్యంలో డీజేలకు పర్మిషన్ లేదని పోలీసు అధికారులు స్పష్టం చేశారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు అడిషనల్ సీపీ జయరాం, ఏసీపీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నగర సీఐ కార్యాలయంలో డీజే నిర్వాహకులకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నగర సీఐ నరహరి మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున డీజేలు పెట్టేందుకు అనుమతులు లేవని అన్నారు. పోలీసుల అనుమతి లేకుండా ర్యాలీలు, ఇతర కార్యక్రమాల్లో డీజేలు పెట్టవద్దని, నిబంధనలు ఉల్లఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం డీజే యజమానులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. కార్యక్రమంలో ఎస్సైలు సంజీవ్, ప్రవీణ్ కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.